# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 2 వ తేదీన రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తారని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**

2. **ఈ రోజు విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేరొన్నారు.**

3. **అమరావతిలో వెయ్యి ఎకరాల్లో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

4. **చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.**

5. **ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం**

==========================

జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గామ్‌లో పర్యటకులపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సౌదీ అరేబియా పర్యటనను రద్దు చేసుకుని ఈ రోజు భారత్ చేరుకున్నారు. ఈ ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలోనే అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీతో సమావేశమై ఈ ఘటన గురించి చర్చించారు. మరోవైపు దాడి జరిగిన ప్రాంతంలో భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసుల సంయుక్త కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. కేంద్ర హోం మంత్రి అమీత్ షా ఉగ్రవాదుల దాడిపై శ్రీనగర్‌లో ఈరోజు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 2 వ తేదీన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తారని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజధాని ప్రాంతంలో 64 వేల కోట్ల రూపాయల విలువైన పనులకు సంబంధించిన టెండర్లను పిలిచామని చెప్పారు. 2 వ తేదీన ప్రధానమంత్రి సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని మంత్రి తెలియజేస్తూ,...

వాయిస్...26 సెకన్లు

------------------------------

పదవ తరగతి పరీక్ష ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు విడుదల చేశారు. ఈ ఫలితాలలో 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా.. వారిలో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

కాగా ఈ ఫలితాల్లో 93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది.

------------------------------

రాష్ట్రంలోని విద్యాసంస్థలకు రేపటి నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. కాగా జూన్ 5 నుంచి ఉపాధ్యాయులు విధులకు హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలకు కూడా రేపటి నుంచి సెలవులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

------------------------------

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతిక శుక్లా తెలిపారు. ఇటీవల విడుదల చేసిన పరీక్షా ఫలితాల పునఃగణన, పునఃపరిశీలన ప్రక్రియలకు సంబంధించిన రుసుము చెల్లింపుల గడువును కూడా ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

------------------------------

అమరావతిలో వెయ్యి ఎకరాల్లో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం ఆధునీకీకరణ పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.వారిలో నైపుణ్యాలను వెలికి తీసి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ 30 సెకన్లు

------------------------------

చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా నందివర్గంలో మ చేనేత కార్మికులకు మగ్గాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, బనగానపల్లె క్లస్టర్ అభివృద్ధిలో భాగంగా తొలి విడతలో 75 మందికి మగ్గాలను అందజేయడం జరిగిందని తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా చేనేత కుటుంబాలకు 200ల యూనిట్లు కరెంటును ఉచితంగా ఇస్తున్నామని మంత్రి తెలియజేసారు.

------------------------------

తగిన పోషకాహారం తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని మహిళా శిశు సంక్షేమశాఖ

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పోషణ్ పఖ్వాడా–2025 కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో గ్రామీణ, పట్టణ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు.

-------------------------

ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ "యునెస్కో' ఆధ్వర్యంలో 1995వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 23వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పుస్తకాలను డిజిటలైజ్ చేయడం వల్ల రచయితకున్న కాపీ హక్కులు హరించిపోతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా గ్రంథచౌర్యం ప్రబలిపోతున్న నేపథ్యంలో కాపీ హక్కుల పరిరక్షణ చర్యలు చేపట్టడంలో భాగంగా "ప్రపంచ పుస్తక, కాపీ హక్కుల దినోత్సవాన్ని" నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. యువతలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంపొదించే కార్యక్రమాలను రూపొందించాలని కూడా యునెస్కో స్వచ్ఛంద సంస్థలను కోరింది.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-------------------------

పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన 'ప్రధానమంత్రి సుపోషిత్ పథకం' తిరుపతి జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1050 అంగన్వాడీ కేంద్రాలు ఎంపిక కాగా అందులో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నెరి గ్రామం ఎంపికైంది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి –సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ,

వాయిస్ 28 సెకన్లు

-------------------------

రాష్ట్రానికి సంబంధించిన ఇంజనీరింగ్ , వ్యవసాయ , ఫార్మసీ రంగాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష – ఏపీ–ఈఏపీసెట్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సెట్ ఛైర్మన్, కాకినాడ జేఎన్‌టీయూ ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 3,41,355 మంది దరఖాస్తు చేసుకున్నారని.. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రేపటి వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 46, హైదరాబాద్‌లో రెండు ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మే 12 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అదే నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావ్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 20 సెకన్లు....

=====================